క్లుప్తంగా

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

మలికిపురం: ఎంపీపీ కార్యాలయంలో వివిధ గ్రామ సచివాలయాల్లో ఖాళీ అయిన వలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు సోమవారం కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంట 9 వలంటీర్ పోస్టులకు గాను 13 మంది దరఖాస్తు చేసుకోగా 12 మంది హాజరయ్యారు. ఇంటర్వ్యూలను ఎంపీడీవో ముత్యం వీరాస్వామినాయుడు నిర్వహించగా, తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు, ఈవోపీఆర్డీ బి.మంగాదేవి, ఏవో జి.మిల్టన్ పర్యవేక్షించారు. త్వరలోనే నిబంధనలు ప్రకారం అర్హత కలిగిన వారిని ఎంపిక చేసి వారికి నియామక పత్రాలు అందించి ఒక రోజు ట్రైనింగ్ నిర్వహిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

రోగాలతో అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆ రోగాలతో అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది ఆయా గ్రామాల్లోని ప్రజలకు వివరిస్తున్నారు. వాకలగరువు, నందంపూడి, తొండవరం, మాచవరం తదితర గ్రామాల్లో సోమవారం మెడికల్ క్యాంపులను నిర్వహించారు. సీహెచ్ఓ బి.అప్పారావు మెడికల్ క్యాంపులను పరిశీలించి మాట్లాడుతూ జ్వరం వస్తే తక్షణమే ఏఎన్ఎం, ఆశాలను సంప్రదించి మెరుగైన వైద్య సేవలు పొందాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జేవీఎస్ ప్రసాద్, ఏఎన్ఎంలు, ఎంపీహెచ్ఓలు, ఆశాలు పాల్గొన్నారు.

వరద బాధితులకు రోటరీ క్లబ్ చేయూత



అప్పనరామునిలంకలో వరద బాధితులకు పాల ప్యాకెట్లు పంచుతున్న రొటేరియన్లు

సఖినేటిపల్లి: మండలంలోని అప్పనరామునిలంక వరద బాధితులకు సోమవారం మలికిపురం రోటరీ క్లబ్ తన వంతు సహకారాన్ని అందించింది. ఈ మేరకు బాధితులకు 200 లీటర్ల పాల ప్యాకెట్లను క్లబ్ పంపిణీ చేసింది. క్లబ్ అధ్యక్షుడు ఎస్.మురళీకృష్ణ, అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివకుమార్, ట్రెజరర్ తోలేటి సతీష్ పంపిణీని ప్రారంభించారు. సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, రొటేరియన్స్ మట్టా రవి, గెద్దం పేర్రాజు, నాయకులు బర్రె శ్రీను, తాడి సహదేవ్, చింతా రాజబాబు, నల్లి సుధీర్, నల్లి మోహన్ పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



రాజోలు కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో న్యాయవాదుల నిరసన

రాజోలు: బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది విశల్‌బాబు హత్యను నిరసిస్తూ రాజోలు బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం తమ విధులను బహిష్కరించారు. ఇటీవల కాలంలో న్యాయవాదులపై దాడులు, హత్యలు, తప్పుడు కేసులు నమోదు చేయడం వంటి సంఘటనలు అనేకం జరుగుతున్నాయన్నారు. న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. న్యాయవాది విశల్ హత్య కేసులో దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కోట సుధాకర్, కొక్కెరగడ్డ శేషగిరిరావు, న్యాయవాదులు ఆచంట శ్రీనివాస్, చింతా ప్రసాద్, బొంతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

అంబాజీపేట: అనారోగ్యంతో వైద్యం చేయించుకున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సోమవారం అందజేశారు. పుల్లేటికుర్రుకు చెందిన కొప్పిశెట్టి దుర్గాభవాని రూ.60 వేలు, మొసలపల్లికి చెందిన మట్టా వెంకటలక్ష్మికి రూ.55 వేలు చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రేగుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన సదస్సు

రాజోలు: పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పొదలాడ పంచాయతీ వద్ద సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ కడలి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సదస్సులో డీటీ ఎస్.శ్రీనివాస్ ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎలాంటి వివక్షతలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఎంపీటీసీ శిరిగినీడి వెంకటేశ్వరరావు, కొల్లాబత్తుల సతీష్‌బాబు, వీఆర్వో ఎ.గంగాధర్, పంచాయతీ కార్యదర్శి ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆహారం పంపిణీపై వివాదం

మామిడికుదురు: అప్పనపల్లిలో వరద బాధితులకు 260 మంది బాధితులు ఉండగా 80 మందికే భోజనం ప్యాకెట్లు పంపిణీచారని స్థానికులు ఆరోపించారు. ఒక రేషన్ కార్డుకు ఒక ప్యాకెట్ మాత్రమే పంపించారని వాటిని తాము తీసుకోకుండా నిరసన తెలిపామన్నారు. ఉదాసీనంగా వ్యవహరించారంటూ తహసీల్దార్ రియాజ్ హుస్సేన్‌పై కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆగ్రహం వ్యక్తం చేశారు.

వరద తగ్గుముఖం

- వీడని ముంపు బెడద
- ఉచితంగా తాగునీటి సరఫరా
- ఆహార ప్యాకెట్ల పంపిణీ



అయినవిల్లి మండలం ముక్తేశ్వరం-అయినవిల్లిలంక వెదురుబిడెం కాజ్‌వే వద్ద కొనసాగుతున్న వరద

మామిడికుదురు: గోదావరి వరద వైనతేయ నదీతీరంలోని లంక గ్రామాలను ముంచెత్తింది. అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, పెదపట్నం గ్రామాలతో పాటు పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాల్లోని తీర ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. బి.దొడ్డవరంలో ఇందిరమ్మ కాలనీ మొత్తం జలదిగ్బంధంలో చిక్కుకుంది. గోదావరి వరదతో తీర గ్రామాల ప్రజలు తీర గ్రామాల ప్రజలు తీర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోట్ల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. పాశర్లపూడి, పాశర్లపూడిలంక ప్రాంతాలకు చెందిన 800 మంది బాధితులకు ఉచితంగా ఆహారం ప్యాకెట్లు అందించారు. వరద ప్రభావిత గ్రామాలకు ఇంత వరకు 1500 టిన్నులు తాగునీటిని సరఫరా చేశారు. అలాగే అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం ఆధ్వర్యాన 1500 వరద బాధితులకు ఆహారం పంపిణీ చేశారు. అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా వరద బాధితులకు వైద్య సేవలందిస్తున్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, ఇతర శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యటిస్తూ వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

అయినవిల్లి: మండలంలోని లంక క్రమంగా వరద తగ్గుముఖం పడుతోంది. అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, మడుపల్లి, పొట్టిలంక, కొండుకుదురులంక, తొత్తరమూడిలోని కె.పెదలంక, చింతనలంక గ్రామాల్లో పలు పల్లపు ప్రాంతాలు వరదనీటితో నిండాయి. ముక్తేశ్వరం–అయినవిల్లిలంక వెదురుబిడెం కాజ్‌వే పై వరద కొనసాగుతోంది. వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, చింతనలంక, పొట్టిలంక, కొండుకుదురులంకల్లో అయినవిల్లి, వీరవల్లిపాలెం పీహెచ్‌సీలు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశాయి. వీరవల్లిపాలెం, పొట్టిలంక గ్రామాల్లో పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయి. లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలో ఉన్న ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పశువులను సురక్షిత ప్రాంతాల్లోకి తరలించారు. ప్రస్తుతం పశుగ్రాసం కొరతలో పశువులు అలమటిస్తున్నాయి. పలు కూరగాయ, అరటి తదితర పంటలకు వరదనీటిలో ముంపునకు గురయ్యాయి.

ఆలమూరు: మండలంలోని లంక గ్రామాల్లో వరద ఉధృతి సోమవారం నిలకడగా ఉంది. బడుగువాని లంకలోని గయ్యాలీ, పొగరుబోతు, చెముడులంక పాయల్లో వరద నీరు క్రమంగా తగ్గుముఖం పట్టింది. తోకలంక-మూలస్థాన అగ్రహారం మధ్య పల్లపు ప్రాంతం ఇంకా వరద నీరు ప్రవహిస్తుండడంతో ఇంకా రాకపోకలు పునరుద్ధరణ జరగలేదు. జొన్నాడలోని పుష్కరాల రేవు, శ్మశానవాటిక ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, రావులపాలెం సీఐ ఎన్.రజనీకుమార్, ఎస్సై ఎస్.శివప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు లంక ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందజేశారు.

వరద ముంపులోనే లంక గ్రామాలు

సఖినేటిపల్లి: మండలంలోని అప్పనరామునిలంక, సఖినేటిపల్లిలంక గ్రామాలను వరద చుట్టుముట్టింది. ప్రధానంగా అప్పనరామునిలంక పూర్తి జలదిగ్బంధంలో ఉంది. పడవలపైనే గ్రామస్తులు టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద నుంచి ఇళ్లకు రాకపోకలు సాగిస్తున్నారు. సఖినేటిపల్లిలంకలో రేవు వద్ద నుంచి బోను వరకూ ఉన్న ప్రధాన రహదారిలో పలుచోట్ల వరద చేరింది. వీటితో పాటు సఖినేటిపల్లి లాకుపేటలోని గోదావరి పాయను ఆనుకుని ఉన్న ఇళ్లు కూడా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. తాగునీటిని టిన్‌ల ద్వారా పడవలపై ముంపు గ్రామాలకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ సరఫరా చేస్తోంది. సఖినేటిపల్లి, రామేశ్వరం పీహెచ్‌సీల వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ముంపు ప్రాంతాల్లో పడవలపై పర్యటిస్తున్నారు. అప్పనరామునిలంకలో పడవపై ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పర్యటించారు. బాధితులకు సరఫరా అవుతున్న తాగునీటి వసతిపై ఆయన సమీక్షించారు. బాధితులు ఎవరకి కూడా తాగునీటి కొరత లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. వెంట తహసీల్దార్ వై.రామకుమారి, వైస్ ఎంపీపీ రుద్రరాజు చిన రాజా, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, నాయకులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: వరద ఉధృతి స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. అయినప్పటికీ మండలంలోని వశిష్ఠ, వైనతేయ నదీపాయలు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని తొమ్మిది లంక గ్రామాలను వరద చుట్టుముట్టింది. వరదల వల్ల లంక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లంక గ్రామాల్లో అధికారులు సహాయక కార్యక్రమాలను ముమ్మరం చేశారు. తాగునీరు సరఫరా చేస్తున్నారు. మెడికల్ క్యాంపుల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో వరద బాధితులకు ఆహారం అందిస్తున్నారు. పాడి రైతులకు పశుగ్రాసం పంపిణీని ప్రారంభించారు. ఊడిమూడి, జి.పెదపూడిలంకల్లో మూడు రైతు బజార్లను ప్రారంభించారు. లంకల్లోని పంటలు నీట మునగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, మండల ప్రత్యేక అధికారి తిక్కా వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఎం.భారతి వరద ప్రాంతాల్లో పర్యటించారు.



బి.దొడ్డవరంలో ముంపుబారిన ఇందిరమ్మ కాలనీ



టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద నుంచి ముంపు ప్రాంతాల పర్యటనకు వెళుతున్న ఎమ్మెల్యే రాపాక



పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లిలో వరద నీట మునిగిన ప్రధాన రహదారి



పి.గన్నవరం మండలం వాడ్రేవుపల్లిలో నీట మునిగిన ఇల్లు

మహిళ వైద్యానికి ఎమ్మెల్యే సాయం



బాధితురాలి వైద్యానికి సాయం చేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట/రావులపాలెం: అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ ఉన్నత వైద్యం ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి రూ.20 వేలు సాయం అందజేశారు. కొత్తపేట శివారు ఏనుగులమహల్‌కి చెందిన ఒక మహిళ చిచ్చుబుడ్డి వెలిగిస్తూ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఆమెను రావులపాలెంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స చేసి ఉన్నత వైద్యం నిమిత్తం సోమవారం రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. ఆ సందర్భంగా ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి బాధితురాలిని పరామర్శించి, వైద్యులతో సంప్రదించారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. రూ.20 వేలు ఇచ్చి పంపించారు. మందపల్లి వైఎస్సార్ సీపీ నాయకుడు సాదు చెంచయ్య ఉన్నారు.

ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి కృతజ్ఞతలు

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అమలాపురం తరలిపోకుండా కృషి చేసిన కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డికి కళాశాల అభివృద్ధి కమిటీ, మండల చారిటబుల ఎడ్యుకేషన్ సంస్థ కృతజ్ఞతలు తెలియజేసింది. విద్యార్థులు లేరనే సాకుతో దాదాపు అమలాపురం తరలిపోయింది అనుకున్న కళాశాలను ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి తన చాకచక్యంతో ఆలమూరులో కొనసాగేలా చర్యలు తీసుకోవడంపై ఆనందం వ్యకం చేశారు. డిగ్రీ కళాశాల ఎట్టి పరిస్థితుల్లోను తరలించకూడదంటూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణపై ఒత్తిడి తెచ్చి ఈ ఏడాది అడ్మిషన్లకు శ్రీకారం అభినందనీయమన్నారు. డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సర ప్రవేశాల కోసం వెబ్ ఆప్షన్‌లో సోమవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని అధ్యాపక బృందం తెలిపింది.

సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించండి



వద్దిపర్రులో మహిళకు పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: మండలంలోని వద్దిపర్రులో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వం నాలుగేళ్లుగా అందించిన సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ వెళ్లి వివరించారు. లబ్ధిదారుల గణాంకాలతో సహా వివరించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు పొందని వారితో మాట్లాడుతూ అవగాహన కల్పించారు. గడిచిన నాలుగేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా వద్దిపర్రులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కాపు ఇతర సామాజిక వర్గాలకు కలిపి మొత్తం రూ.10,42,12,818 లబ్ధి చేకూరిందన్నారు. అనంతరం స్థానిక మసీదును సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, మాజీ సర్పంచ్ కొరుప్రోలు వెంకటేశ్వరరావు, ఎంపీడీవో నాతిబుజ్జి, తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్, గాదిరాజు రామకృష్ణంరాజు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

‘రోటరీ’కి పూర్వ వైభవం తీసుకురావాలి



శివానందంను సత్కరిస్తున్న ఏజీ శివకుమార్

కొత్తపేట: రోటరీ క్లబ్ సేవలు విస్తృతం చేయడం ద్వారా పూర్వ వైభవం తీసుకురావాలని రోటరీ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ (ఏజీ) నల్లి శివకుమార్ అన్నారు. రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వుడయార్ శిల్పకళా ప్రాంగణంలో జరిగిన సభకు డి.రాజ్‌కుమార్‌వుడయార్ అధ్యక్షత వహించగా రోటరీ ఏజీ శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 2023–24కి నూతన అధ్యక్షుడిగా రిటైర్డ్ ఎమ్మార్వో తనికెళ్ల శివానందం, పలువురు రొటేరియన్స్ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికవగా వారితో ఏజీ పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఏజీ శివకుమార్, శివానందంలను రాజ్‌కుమార్, సభ్యులు ఘనంగా సత్కరించారు.

పిచ్చికుక్క దాడిలో ఏడుగురికి తీవ్ర గాయాలు

మలికిపురం: మండలంలోని రామరాజులంకలో సోమవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామంలో మొత్తం ఏడుగురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. చర్చిపేటలో ఆరేళ్ల బాలిక దాకే కేథరిన్‌తో పాటు, పెదతిప్పలో ఒక మహిళను గాయపరిచినట్లు గ్రామానికి చెందిన రాపాక చిట్టిబాబు తెలిపారు. గాయపడిన వారందరూ చికిత్స నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రిలో చేరారు. పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకుని పిచ్చికుక్కను అరికట్టాలని గ్రామస్తులు కోరారు.

వరద ప్రభావిత గ్రామాల్లో పర్యటన



రాజోలు నున్న వారి బాడవలో పర్యటిస్తున్న డీఎల్‌డీఓ థామస్

అయినవిల్లి: మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలైన కొండుకుదురు, పొట్టిలంక, కొండుకుదురులంక గ్రామాల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పి.దుర్గారావు దొర పర్యటించారు. వరద ముంపు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులను సందర్శించి రోగులకు సత్వర సేవలు అందేలా చూడాలని అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. వైద్య సిబ్బంది అందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. వరద ప్రభావిత ప్రజలు కాచి వడబోసిన నీరు మాత్రమే తాగాలని పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో ఆయన వెంట వైద్యులు సునీల్, వైద్య సిబ్బంది రామకృష్ణ, రామారావు, మేరీ, సత్య శ్రీనివాస్, నరసింహారావు తదితరులు ఉన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: మండలంలోని ముంపు ప్రాంతాలైన వాకలగరువు, తొండవరం, నందంపూడి గ్రామాలను ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ టి.మంగతాయారు, ఎంపీడీఓ కె.సత్యనారాయణలు సోమవారం పరిశీలించారు. వైనతేయ గోదావరితో పాటు కౌశికలు పొంగి పొర్లుతున్నాయి. నందంపూడిలో కౌశిక పొంగి పొర్లడంతో బొంతువారిపేటలో 8, వాకలగరువులో 2, మాచవరం శివారు పోతాయిలంకలో 5 ఇళ్లు నీట మునిగాయని, తొండవరంలో ఒక తాటాకిల్లు నేలమట్టమైందన్నారు. వరద ముంపులో చిక్కుకున్న బాధిత కుటుంబాలకు తక్షణ సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వెంకటేశ్వరరావు అధికారులకు వివరించారు. ముంపు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులను పరిశీలించారు. కార్యక్రమంలో పితాని వీరాస్వామి, నాగాబత్తుల శశి, వీఆర్వోలు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం అందిస్తున్న సహాయక చర్యలను డీఎల్‌డీఓ థామస్ సోమవారం పరిశీలించారు. రాజోలు, సోంపల్లి, తాటిపాక ప్రాంతాల్లో వరద ముంపునకు గురైన ప్రదేశాల్లో ఆయన పర్యటించారు. వైద్య శిబిరాలు, శానిటేషన్ పనులను నిరంతరం నిర్వహించాలన్నారు. రాజోలు నున్న వారి బాడవ, మేకలపాలెం ప్రాంతాల్లో బాధితులకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు, ఎంపీడీఓ ఎం.సత్యనారాయణ, సర్పంచ్ రేవు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో పాలన మరింత చేరువ



ఎల్.గన్నవరంలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత చేరువ చేశారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఎల్.గన్నవరంలో రూ.1.19 కోట్లతో నిర్మించిన గ్రామ సచివాలయం–1, 2, ఆర్బీకే సెంటర్–1, వెల్నెస్ సెంటర్–1 భవనాలను సోమవారం ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రారంభించారు. సొసైటీ కమిటీ చైర్మన్ యన్నాబత్తుల ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్నెస్ సెంటర్ల ద్వారా ప్రజలకు, రైతులకు ఎంతో మేలు జరుగుతుందని చిట్టిబాబు వివరించారు. తొలుత ఆయనకు ఘన స్వాగతం పలికారు. నగరం ఏఎంసీ చైర్‌పర్సన్ నక్కా కృష్ణవేణి, సర్పంచ్ పసలపూడి రామకృష్ణ, పీఆర్ డీఈ చంద్రశేఖర్, ఎంపీడీఓ ఎం.భారతి, నియోజక వర్గ బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, గ్రామశాఖ అధ్యక్షుడు మానుకొండ ప్రసాద్, పార్టీ రాష్ట్ర నాయకుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, పీఆర్ జేఈ కె.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ సంఘటనపై శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీలో పాల్గొనేందుకు పడవపై ప్లకార్డులతో వెళుతున్న కొత్తలంక సంఘస్తులు

రాజోలు: మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన దాడులను నిరసిస్తూ సోమవారం కోనసీమ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. రాజోలు కాటన్ పార్కు నుంచి బైపాస్ రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావుకు అందజేశారు. పాస్టర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: మణిపూర్ మారణహోమంపై అంబాజీపేట మండల దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో కుల, మత, పార్టీలకు అతీతంగా సోమవారం శాంతియుత ర్యాలీని నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల సెంటర్ నుంచి శాంతియుత ర్యాలీ అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ టి.మంగతాయారుకు అందజేశారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, పాస్టర్లు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: స్థానిక బస్టాండ్ కూడలి నుంచి నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ వరకు జాతీయ రహదారి మీదుగా మణిపూర్ ఘటనలను వ్యతిరేకిస్తూ శాంతి ర్యాలీ జరిగింది. ఈ ఘటనలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ శాంతి ర్యాలీలో పాస్టర్లు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: మణిపూర్‌లో జరుగుతున్న దాడులకు నిరసనగా నియోజకవర్గ క్రైస్తవ సమాఖ్య తలపెట్టిన శాంతి ర్యాలీకి సోమవారం అప్పనరామునిలంకకు చెందిన సంఘస్తులు, క్రైస్తవ సోదరులు పడవలపై తరలి వెళ్లారు. పూర్తిగా వరద ముంపులో ఉన్న గ్రామంలోని సెయింట్ పాల్ లూథరన్ చర్చి పరిధిలోని మధ్యగ్రూపు, కొత్తలంక శాఖల సంఘస్తులు, క్రైస్తవ సోదరులు పడవలపై ప్లకార్డ్స్, జాతీయ జెండాలతో తరలివెళ్లారు. బాధితులకు న్యాయం జరగాలంటూ అంతర్వేదిపాలెం నుంచి ప్రారంభమైన శాంతి ర్యాలీకి టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద మెయిన్ రహదారిపై కలిసి వారు ముందుకు సాగారు.

సఖినేటిపల్లి/మలికిపురం: దేశవ్యాప్తంగా ఉన్న క్రైస్తవులకు తగిన రక్షణ కల్పించాలని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం మణిపూర్‌లో జరిగిన ఘటనకు నిరసనగా నియోజకవర్గ క్రైస్తవ సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్వేదిపాలెం ఐపీసీ చర్చి (హల్లెలూయా గ్రౌండ్స్)వద్ద నుంచి మలికిపురం సెంటర్ వరకూ వేలాది మంది క్రైస్తవులు, భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. మలికిపురం సెంటర్లో జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే రాపాక ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మణిపూర్‌లో ధ్వంసమైన చర్చిలను పునరుద్ధరించాలని, శాంతియుత వాతావరణం నెలకొల్పాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు, బిషప్ శామ్యూల్ ఫిన్నీ, స్థానిక సర్పంచ్ గెద్దం రాజ్యలక్ష్మి, మాజీ పరిషత్ ఉపాధ్యక్షుడు గెద్దం తులసీభాస్కరరావు, తోటె ప్రతాప్, నియోజకవర్గంలోని వివిధ చర్చిల పాస్టర్లు, మద్దతుదారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సహాయం అందించాలి



బూరుగులంకలో వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: వరద బాధితులకు ఇబ్బందులు లేకుండా సహాయక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. వరద ముంపునకు గురైన జి.పెదపూడి శివారు బూరుగులంకలో సోమవారం ఆయన పర్యటించారు. లంక గ్రామాల ప్రజలతో మాట్లాడారు. ముంపునకు గురైన గ్రామాల్లో మెడికల్ క్యాంపులు, పారిశుధ్య చర్యలు నిర్వహించాలని, రోజూ తాగునీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. వరదలు తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి, జిల్లా వాణిజ్య విభాగం నాయకుడు మంతెన రవిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్ దంగేటి అన్నవరం, ఎంపీటీసీ పల్లి మోషే, పార్టీ నాయకులు సాధనాల రమేష్, కత్తుల విక్టర్, దొమ్మేటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం



చెముడులంకలో విద్యార్థులకు సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఆలమూరు: ఇటీవల మండలంలోని చెముడులంకలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన ఇరువురు బాధిత కుటుంబాలకు గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు సాయం అందజేశారు. గ్రామంలో జరిగిన ఈ విషాద సంఘటనను ప్రచార మాధ్యమాల్లో తెలుసుకున్న చెముడులంక జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు స్పందించి విరాళాలను అందజేశారు. విరాళాల ద్వారా సేకరించిన రూ.44 వేలను సోమవారం బాధిత కుటుంబాలకు అందజేశారు. అలాగే స్థానికంగా నివాసముంటున్న పూర్వ విద్యార్థులైన దూలం శ్రీనివాస్, అన్నందేవుల సతీష్, డాక్టర్ వడ్డి శ్రీనివాస్, గుంగుమళ్ల సాయి, కొంద్రెడ్డి శ్రీనివాస్ తదితరులు బాధితులకు గ్యాస్ స్టవ్‌లు, సిలిండర్లు, వంట పాత్రలను అందజేశారు.

వలంటీర్లపై సర్పంచ్‌ల ఫిర్యాదు

మలికిపురం: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ వలంటీర్లు ప్రభుత్వ పాలనలో జోక్యం చేసుకుని ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని, వారిని కట్టడి చేయాలని మండలానికి చెందిన పలువురు సర్పంచ్‌లు ఎంపీడీఓ ముత్యం వీరాస్వామినాయుడుకు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ మేరకు ఫిర్యాదు అందజేశారు. విశ్వేశ్వరాయపురంలో ఇటీవల సర్పంచ్ హెలీనాపై వలంటీర్లు దురుసుగా ప్రవర్తించారని, వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు ఈ ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

వలంటీర్ల తప్పేమీ లేదు

మండలంలోని విశ్వేశ్వరాయపురంలో వలంటీర్లపై తప్పుడు ఫిర్యాదు చేయడం సర్పంచ్ చెల్లుబోయిన హెలీనాకు తగదని ఎంపీటీసీ గుబ్బల గౌరీ వెంకట పద్మావతి స్పష్టం చేశారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఇటీవల జరిగిన జగనన్న సురక్ష గ్రామ సభలో సంక్షేమ పథకాలు అందడం లేదని ప్రభుత్వాన్ని సర్పంచ్ హెలీనా విమర్శిస్తున్న నేపథ్యంలో వలంటీర్లు అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మాత్రమే చెప్పారని, దీనిపై సర్పంచ్ హెలీనా లేని పోని రాద్ధాంతం చేస్తున్నారని ఆమె అన్నారు.

రైతులకు దాణా పంపిణీ

పి.గన్నవరం: మండలంలోని జి.పెదపూడిలో వరద ముంపు గ్రామాల పాడి రైతులకు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సోమవారం పశువుల దాణా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి, పశు సంవర్ధక ఏడీ ఎల్.విజయారెడ్డి, సర్పంచ్ దంగేటి అన్నవరం, ఎంపీటీసీ పల్లి మోషే, పార్టీ నాయకుడు మంతెన రవిరాజు పాల్గొన్నారు.